# ఆదిలాబాద్ వార్త



అదిలాబాద్, మంచిర్యాల, అసిఫాబాద్, నిర్మల్,

బుధవారం 24, మే 2023 8 పేజీలు


## సమీకృత కలెక్టరేట్ భవన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి

-జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్



సమీకృత కలెక్టర్ భవన సముదాయాన్ని పరిశీలించిన కలెక్టర్

**మంచిర్యాల ప్రతినిధి, ప్రభాతవార్త** సమీకృత జిల్లా కార్యాలయాల (కలెక్టరేట్) సముదాయ భవనం పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశించారు.

-రాష్ట్ర మంత్రి తన్నీరు హరీష్ రావు

## తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను.... విజయవంతం చేయాలి



వివరాలు 2 లో..

**ఉమ్మడి ఆదిలాబాద్ బ్యూరో, ప్రభాతవార్త** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భవించి 10 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు మంగళవారం హైదరాబాద్: నుండి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో ఆరోగ్య కేంద్రాలు, కంటి వెలుగు, న్యూట్రిషన్ కిట్ల పంపిణీ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.



వివరాలు 3 లో..

## జిల్లా నూతన రవాణా కార్యాలయాన్ని ప్రారంభించిన... మంత్రి అల్లోల

**నిర్మల్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని చించోలి(బి) శివారులో రూ. 3 కోట్ల 50 లక్షలతో నిర్మించిన నూతన జిల్లా రవాణా కార్యాలయాన్ని మంగళవారం రోజు రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ప్రారంభించారు.





2 లో..

## వరిధాన్యం, మొక్కజొన్న కొనుగోలు సేకరణపై సమీక్ష

మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

**నిర్మల్ కలెక్టరేట్, ప్రభాతవార్త :** వరిధాన్యం, మొక్కజొన్న కొనుగోలు సేకరణపై మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, జిల్లా పాలనాధికారి వరుణ్‌రెడ్డితో కలిసి మంగళవారం అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రైస్ మిల్లర్లు, ట్రాన్స్‌పోర్టర్లు తమ తమ సమస్యలను మంత్రి, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. మంత్రి మాట్లాడుతూ ధాన్యం తడిసిపోయి ఉంటే వాటిని పూర్తిగా ఎండబెట్టిన తర్వాత లోడింగ్ చేసి పంపితే ఎటువంటి తరుగు ఉండదని, లారీలు సిద్ధంగా లేకున్నా కూడా ముందుగానే సంచిలలో నింపి ఉంచడం వలన వర్షాలకు తడిసిన ధాన్యంలో మొలకలు వస్తాయని, లారీలు అందుబాటులో ఉన్న ప్రాంతాలలో మాత్రమే లోడింగ్ చేయాలని రైస్ మిల్లర్లను కోరారు.

## నకిలీ విత్తనాల సరఫరా, విక్రయంపై ప్రత్యేక నిఘా...

2వ పేజీలో...



... జిల్లా ఎస్పి సురేష్‌కుమార్

**కాగజ్‌నగర్, ప్రభాతవార్త :** నకిలీ విత్తనాల విక్రయం, సరఫరాపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు జిల్లా ఎస్పి సురేష్‌కుమార్ అన్నారు. మంగళవారం కాగజ్‌నగర్‌లోని సంతోష్ ఫంక్షన్‌హల్‌లో అగ్రికల్చర్ అధికారులు, ఫర్టిలైజర్ షాపు యజమానులతో నకిలీ విత్తనాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ నకిలీ విత్తనాలు విక్రయించి రైతులను మోసం చేస్తే అట్టి వారిపై పీడియాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## అటవీ పోడు భూముల హక్కు పత్రాల... జాడ ఏది..!



- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 60వేల దరఖాస్తుల సమర్పణ
-ఆదివాసుల పోడు భూముల సమస్య తీరేనా..!
- ఫారెస్ట్ అధికారుల ఆదివాసుల మధ్య మళ్లీ రగిలిపోనున్న పోడు వార్



2 లో..

# అటవీ పోడు భూముల హక్కు పత్రాల జాడ ఏది..!

ఉమ్మడి ఆదిలాబాద్ బ్యూరో, ప్రభాతవార్త

**మొదటి పేజీ తరువాయి :** ఆదివాసులు సాగు చేస్తున్న అటవీ పోడు భూములకు హక్కు పత్రాలు కల్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఇప్పటి వరకు హక్కు పత్రాల పంపిణీ చేసిన జాడ కనిపించడం లేదు. గత అసెంబ్లీ సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదివాసుల సాగు చేస్తున్న పో డు భూములకు పట్టాలు కల్పించి వాటికి రైతుబంధు రైతు బీమా కరెంట్ లాంటి వసతులు కల్పిస్తామని అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి ప్రస్తావించారు. కానీ ఇప్పటి వరకు ఒక ఎకరానికి కూడా హక్కు పత్రాలు కల్పించక పోవడ చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 60వేల దరఖాస్తులు సమర్పిస్తే ఇప్పటి వరకు ఒక ఎకరానికి కూడా హక్కు పత్రాలు పంపిణీ చేయలేదు. ఖరీఫ్ సీజన్ సమీపిస్తుండడంతో రైతుదారులు ఆందోళనన చెందుతున్నారు. పోడు వ్యవసాయం సాగు చేస్తున్న భూముల్లో విత్తనాలు నాటిన అనంతరం అటవీ శాఖ అధికారులు వచ్చి విత్తన పంటను తొలగించి మొక్కలు నాటుతారేమోని రైతులు భయాందోళన గురవుతున్నారు. ఇటీవల పోడు భూముల హక్కు పత్రాల కోసం 4.14 లక్షల మందిగాను 12.14 లక్షల ఎకరాలకు దరఖాస్తు సమర్పిస్తే అటవీ శాఖ అధికారులు, రెవెన్యూ, గ్రామస్థాయి అధికారుల ఆర్ఓఎఫ్ఆర్ కమిటీలతో సర్వే చేయించుకోని నెలలు గడుస్తున్న పోడు భూముల హక్కు పత్రాలు పంపిణీ చేయడం లేదాని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2006 చట్టం ప్రకారం 2005 ముందు అటవీ భూములను సాగు చేస్తున్న రైతుల అందరికీ భూమిపై హక్కు పత్రాలు ఇవ్వాలని, చట్టంలో నిర్దేశించిన ప్రకారం హక్కు పత్రాలు అందజేయాలి, పోడు భూములకు రేవు మాపో హక్కు పత్రాలు పంపిణీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తుందని దరఖాస్తు దారులు వాపోతున్నారు. పోడు భూములపైన అనేక కీలక సమావేశంలో జరిపిన పోడు భూముల సమస్య ఎక్కడికి వేసిన గొంగలి అక్కడే ఉన్నట్లు కనిపిస్తుంది. పోడు భూములకు పట్టాలేస్తామని చెప్పిన ప్రభుత్వం పోడు అప్లికేషన్ తీసుకొని కొన్ని నెలల నుంచి ప్రాసెస్ మొదలబెట్టింది. ఓ వైపు పట్టాలు ఇస్తామని, మరోవైపు హరితహారం ట్రెంచులు కొడుతున్న నేపథ్యంలో ఆదివాసులు అటవీ శాఖ అధికారులు మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. అటవీ పోడు భూములను సాగు చేస్తున్న ఆదివాసులకు హక్కు పత్రాలు కల్పిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి పలుమార్లు ప్రకటించిన హక్కు పత్రాలు పంపిణీలో కాల యాపన చేస్తూ నిర్లక్ష్యం వహిస్తున్నారని రాష్ట్ర ముఖ్యమంత్రి ఓటు బ్యాంక్‌గా వాడుతున్నారని ఆదివాసీ సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

# వరిధాన్యం, మొక్కజొన్న కొనుగోలు సేకరణపై సమీక్ష

నిర్మల్ కలెక్టరేట్, ప్రభాతవార్త :

**మొదటి పేజీ తరువాయి :** లారీ ఓనర్ అసోసియేషన్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ లారీ లోడింగ్ వేరే జిల్లాలకు వెళ్లి అన్‌లోడింగ్ అయి రావడానికి మూడు నుంచి నాలుగు రోజుల సమయం పడుతుందని, అలా కాకుండా ఇదే జిల్లాలో రైస్ మిల్లును కేటాయిస్తే ఇబ్బంది ఉండదని అలా కానిపక్షంలో ఇతర జిల్లా రైస్‌మిల్లర్లతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఈ రబీ సీజన్‌లో 5 లక్షల 5981 క్వింటాళ్ల వరిధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని, నాలుగు లక్షల 11550 క్వింటాళ్ల వరిధాన్యాన్ని తరలించామని, ఇంకా



94,40031 క్వింటాళ్ల వరి ధాన్యం మిగిలి ఉందని, దీనిని కూడా తొందరలోనే కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలిస్తామని తెలిపారు. 42 లక్షల 50 వేల గోనె సంచులు అవసరం కాగా 35 లక్షల 51 వేలు అందుబాటులో ఉన్నాయని, ఇంకా ఆరు లక్షల 99 ల సంచులు మాత్రమే రావాల్సి ఉందని, ఇంకా వరిధాన్యం కొన్ని మండలాలల్లో కోతల దశలలోనే ఉన్నందున వీలైనంత త్వరగా కోతలు పూర్తిచేయాలని ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని అన్నారు. ఈ కార్య క్రమంలో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, అడిషినల్ కలెక్టర్ రాంబాబు, వరిధాన్యం కొనుగోలు చేస్తున్న సొసైటిల ప్రతినిధులు వివిధ మార్కెట్ కమిటీల చైర్మెన్లు, తహసిల్దార్లు, లారీ ఓనర్స్ అసోసియేషన్, రైస్ మిల్లర్లు, ఓనర్ అసోసియేషన్ డిసిఎస్ఓ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి

ఉమ్మడి ఆదిలాబాద్ బ్యూరో, ప్రభాతవార్త

**మొదటి పేజీ తరువాయి :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భవించి 10 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన దశబ్ది ఉత్సవాలను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు మంగళవారం హైదరాబాద్: నుండి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో కలిసి వీడియో కన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో ఆరోగ్య కేంద్రాలు, కంటి వెలుగు, న్యూట్రిషన్ కిట్ల పంపిణీ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ గర్భిణులు



రక్తహీనతతో బాధపడకుండా ప్రభుత్వం చేపట్టిన న్యూట్రిషన్ కిట్ల పంపిణి కార్యక్రమంవ మొదటి దశలో 9జిల్లాలో అమలు చేయడం జరిగిందని, రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే హెల్త్ డే రోజున 24 జిల్లా లోని అన్ని శాసనసభ నియోజకవర్గ కేంద్రాల్లో అట్టహాసంగా న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 6.84 లక్షల మంది గర్భిణిలకు కేసిఆర్ కిట్లు అందేలా కార్యచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కేసిఆర్ కిట్ పథకాన్ని అమలు చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించగలిగామని, మాతా శిశు మరణాలను అరికట్టడంలో తెలంగాణ దేశంలోనే మూడవ స్థానంలో ఉందని, ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరిగిందని తెలిపారు. గర్భిణిలలో రక్తహీనతను నివారిస్తూ, పుట్టబోయే శిశువులు ఆరోగ్యంగా ఉండేలా న్యూట్రిషన్ కిట్లను పంపిణి చేయడం జరుగు తుందని తెలిపారు. ఆరోగ్య కేంద్రాల కొరకు సొంత భవనాలు మంజూరు చేసినందున, వాటి నిర్మాణాలను అవసరమైన స్థలాలను గుర్తించాలని టెండర్ల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలపి, నిర్మాణాలు చేపట్టిన చోట నిర్ణీత గడువులోపు పూర్తయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్రంలోని ప్రజలు కంటి సమస్యలు తొలగించేందుకు చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం ద్వారా 80 పని దినాల్లో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 1 కోటి 50 లక్షల మందికి కంటి పరీక్షలు నిర్వహించి 38 లక్షల 54 వేల మందికి కంటి అద్దాలు అందించడం జరిగిందని, ఇందులో 21 లక్షల 46వేల మందికి రీడింగ్ అద్దాలు, 8వేల మందికి ప్రిస్క్రిప్షన్ అద్దాలు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అధికారులు,



వైద్యులు, వైద్య సిబ్బంది కృషి అభినందనీయమని అన్నారు. నూతనంగా 2వేల 38 ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉప కేంద్రాలను మంజూరు చేసి 422 ఉప కేంద్రాల నిర్మాణ పనులు పూర్తి చేయడం జరిగిందని, 177 పనులు తుది దశలో ఉన్నాయని, 610 నిర్మాణ పనులు వివిధ దశలో ఉన్నాయని తెలిపారు. జిల్లాలకు నూతనంగా మంజూరు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాలు, జిల్లా కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సావాలు ఘనంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నామని, కంటి వెలుగు 2వ విడుత కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 40 కంటి వెలుగు శిబిరాలను ఏర్పాటు చేసి 40 బృందాలను నియమించి వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో గర్భిణులు ఆసుపత్రులలోనే ప్రసవాలు చేసుకేనే విధంగా విస్తృత ప్రచారం నిర్వహిస్తూ అవగాహన కల్పించడం జరుగుతుందని రక్తహీనత సమస్యలను నియంత్రించేందుకు తీసుకుంటున్నామని తెలిపారు.

# మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని కలిసిన పంచాయతీ కార్యదర్శులు

నిర్మల్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త :



**మొదటి పేజీ తరువాయి :**జూనియర్ పంచాయతీ కార్యదర్శుల(జేపీఎస్) సర్వీసును క్రమబద్ధీకరించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించిన సందర్భంగా మంగళవారం జిల్లా పంచాయతీ కార్యదర్శులు నిర్మల్ మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తమ సర్వీసును రెగ్యులరైజ్ చేసినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా మంత్రిని శాలువతో సత్కరించారు. ప్రభుత్వ ఉద్యోగుల సేవను గుర్తించి రెగ్యులరైజ్ చేసిందని జిల్లా అభివృద్ధికి పాటుపడుతూ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని మంత్రి వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిసిబి చైర్మెన్ రాంకిషన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శుల అధ్యక్షులు బసగుట్ట శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు రాజువర్మ, జనరల్ సెక్రటరీ ప్రవీణ్, స్టేట్ ఈసీ మెంబర్ అభిలాష్, నిర్మల్ మండల అధ్యక్షుడు గొజ్జ నితీష్, సంధ్య తదితరులు ఉన్నారు.

# సమీకృత కలెక్టరేట్ భవన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి

మంచిర్యాల ప్రతినిధి, ప్రభాతవార్త

**మొదటి పేజీ తరువాయి :**మంగళవారం జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలో నిర్మితమవుతున్న సమీకృత కలెక్టర్ నిర్మాణ పనులను జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి.రాహుల్ తో కలిసి పరిశీలించారు. కలెక్టరేట్ భవనంలో జిల్లా శాఖల కార్యాలయాలు, వివిధ సేవల నిమిత్తం కలెక్టరేట్ వచ్చే ప్రజలు వేచి ఉండే ప్రాంతాలు, భవన ఆవరణ, సమావేశ మందిరం పనులను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ పనులన్ని ఒకే చోట అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం చేపట్టిన సమీకృత కలెక్టరేట్ భవనాల నిర్మాణాలలో భాగంగా జిల్లాలో చేపట్టిన కలెక్టరేట్ పనులను వేగవంతం చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని, అంతర్గత రహదారులు, గ్రీన్ కారిడార్, మురుగు కాలువల వ్యవస్థ, త్రాగునీరు, విద్యుత్ సరఫరా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రోడ్లు-భవనాల శాఖ ఈఈ పెద్దన్న, సంబంధిత శాఖల అధికారలు తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాల విక్రయం, సరఫరాపై ప్రత్యేక నిఘా...

... జిల్లా ఎస్పి సురేష్‌కుమార్

కాగజ్‌నగర్, ప్రభాతవార్త :

**మొదటి పేజీ తరువాయి :**నకిలీ విత్తనాల విక్రయం, సరఫరాపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు జిల్లా ఎస్పి సురేష్‌కుమార్ అన్నారు. మంగళవారం కాగజ్‌నగర్‌లోని సంతోష్ ఫంక్షన్‌హల్‌లో అగ్రికల్చర్ అధికారులు, ఫర్టిలైజర్ ఫాపు యజమానులతో నకిలీ విత్తనాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ నకిలీ విత్తనాలు విక్రయించి రైతులను మోసం చేస్తే అట్టి వారిపై పీడియాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు.సీఎం కేసిఆర్, డీజిపి అంజని కుమార్‌ల ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా నకిలీ విత్తనాల విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. నకిలీ విత్తనాలు విక్రయించినా, సరఫరా చేసినా పీడీ యాక్టు నమోదు చేసి జైలుకు పంపిస్తామని అన్నారు. వానాకాలం సాగు దృష్టిలో ఉంచుకొని రైతులు నకిలీ విత్తనాల బారిన పడకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో నకిలీ విత్తనాల సరఫరా,ఉత్పత్తి, అమ్మకాలను అరికట్టడానికి వ్యవసాయ, పోలీస్‌శాఖ సంయుక్తంగా మండల స్థాయిలో ప్రత్యేక స్పెషల్ టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీస్ బృందం ఎప్పటికప్పుడు తనిఖీలు, అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో ఎవరైనా వ్యాపారులు, సంస్థలు, వ్యక్తులు నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే స్థానిక పోలీస్ అధికారులకు గానీ, డయల్ 100కు గానీ 6302430500 నెంబర్‌కు సమాచారం అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పి కరుణాకర్, కాగజ్‌నగర్ టౌన్ సీఐ బుద్దే స్వామి, కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు, కౌటాల సీఐ సాదిక్‌పాషా, వ్యవసాయశాఖ అధికారులు, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

# నూతన జిల్లా రవాణా కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి, కలెక్టర్

నిర్మల్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త :





జిల్లా కేంద్రంలోని చించోలి(బి) శివారులో రూ. 3 కోట్ల 50 లక్షలతో నిర్మించిన నూతన జిల్లా రవాణా కార్యాలయాన్ని మంగళవారం రోజు రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జిల్లాగా ఏర్పడిన నిర్మల్ జిల్లా గత దశాబ్దకాలంగా అన్నిరకాలుగా అభివృద్ధి సాధించిందని, త్వరలోనే నిర్మల్ జిల్లాలో సీఎం కేసీఆర్ పర్యటించి నూతనంగా నిర్మించిన జిల్లా కలెక్టర్ కార్యాలయంతోపాటు జిల్లాకు కొత్తగా మంజూరైన మెడికల్ కాలేజీని సీఎం కేసీఆర్ ప్రారంభిస్తారని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడాలేనివిధంగా నిర్మల్ జిల్లాలో ఆధునిక సాంకేతిక వ్యవస్థలతో జిల్లా రవాణా కార్యాలయాన్ని నిర్మించడం జరిగిందని, ఈ కార్యాలయంలో వచ్చే ప్రజలకు వారు సేదతీరేప విధంగా ప్రత్యేక వెయిటింగ్ హాల్ ఏర్పాటు చేయడం జరిగిందని, జిల్లా రవాణా శాఖ కార్యాలయానికి వచ్చేవారికి ఆహ్లాదాన్ని పంచేవిధంగా చుట్టూ మొక్కలు నాటడం జరిగిందని తెలిపారు. రవాణా చట్టాలను తెలుసుకోవాలని, రోడ్డు రవాణా చట్టాలను ప్రతీ ఒక్కరూ పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషిచేయాలని, చిన్న వాహనాలు పెద్ద వాహనాలు పరీక్షించడానికి 5 ఎకరాల స్థలంలో అణువుగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్‌రెడ్డి, రవాణాశాఖ అధికారి, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్ వార్త



## దేగాం గ్రామంలో పెద్దమ్మతల్లికి బోనాల పండుగ

నిర్మల్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త :



నిర్మల్ జిల్లా భైంసా మండల కేంద్రంలోని దేగాం గ్రామంలో గల పెద్దమ్మతల్లికి గ్రామస్థులు మంగళవారం రోజు బోనాలను సమర్పించారు. అంతకుముందు మహిళలు బోనాలతో శోభాయాత్ర నిర్వహించారు. భక్తులు పెద్దమ్మతల్లిని దర్శించుకోవడానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొబ్బిలి శ్రీనివాస్, మాజీ జడ్పిటిసి సూర్యకాంత్ రెడ్డి, విడిసి చైర్మెన్ గంగారాం, ఉప సర్పంచ్ ఎల్లప్ప, లక్కడి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నిర్మల్, ప్రభాతవార్త :



సోన్ మండలంలోని న్యూవెల్మల్ బొప్పారం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2005-06 సంవత్సర బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు మంగళవారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పినటువంటి ఉపాధ్యాయులు వసుంధర, గంగసురేష్, రామకృష్ణలతో కలిసి తాము చదువుకున్న పాఠశాలంతా కలియతిరుగుతూ పాత జ్ఞాపకాలను జ్ఞాప్తికి తెచ్చుకున్నారు. తమ కుటుంబాల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు శాలువతో ఘనంగా సన్మానించారు. అందరితో కలిసి నృత్యాలు చేస్తూ రోజంతా ఆనందంగా గడిపారు.

## జేపిఎస్‌ల ఆధ్వర్యంలో సిఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

మల్యాల, ప్రభాత వార్త:



జూనియర్ కాంట్రాక్ట్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేసి ఆదుకుంటామని సిఎం కేసీఆర్ ప్రకటించడంతో మల్యాల మండలం జూనియర్ పంచాయతీ కార్యదర్శులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మండల పంచాయతీ కార్యదర్శులు అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం సిఎం కేసీఆర్ చిత్రపటంకు పాలాభిషేకం నిర్వహించారు. న్యాయమైన తమ డిమాండ్లకు సిఎం సహృదయంతో జేపిఎస్ బాధలను అర్థం చేసుకుని తమను రెగ్యులరైజ్ చేస్తామని ప్రకటించడం పట్ల వారు కృతజ్ఞతలు తెలిపారు. అంతేకాకుండా ఎంపిడివో వెంకటేశం, సర్పంచుల ఫోరం అధ్యక్షులు సుదర్శన్, ఎంపివో వాసవి లను కూడా వారు కలిసి కార్యదర్శుల సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు.

## వరి ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలి

నిర్మల్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త :



రైతుల నుంచి ప్రభుత్వం వరిధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ఏఐసిసి రీసెర్చ్ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కన్వీనర్ వినోద్ నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం కడెం మండలంలోని కొత్త మద్దిపడగా, కడెం పెద్దూర్, పెద్దూర్ తాండ గ్రామ శివారులో రైతులు ఎండకు ఆరబోసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ధాన్యం కొనుగోలులో ఆలస్యం జరుగుతుందని, మరోవైపు అకాల వర్షాలు పడుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రైతుల నుంచి వరిధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

### -- మున్సిపల్ చైర్మన్ తక్కళ్ళపల్లి రాజేశ్వర్ రావు

జమ్మికుంట, ప్రభాత వార్త:

కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్ళపల్లి రాజేశ్వర్ రావు అన్నారు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 19వ వార్డులో వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న కోటి ఆధ్వర్యంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ తక్కళ్ళపల్లి రాజేశ్వర్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... ఎక్కడ లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో సిఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమంలో పేద ప్రజల కళ్ళల్లో వెలుగులు నింపుతున్నారని ఆయన అన్నారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ శ్రీనివాస్, దేశిని సదానందం, ఎలగందుల శ్రీహరి, డాక్టర్స్ సన జవేరియా, సందీప్, రత్నాకర్, శంకర్ రెడ్డి, ఏఎన్ఎం వాణిశ్రీ, కవిత, ఆశ వర్కర్లు, సిఎల్ఆర్‌పి మంజుల, ఆర్‌పి జేరిపోతుల సృజన, అంగన్‌వాడీ టీచర్స్ రమాదేవి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## మురికి కాలువలు నిర్మించండి

నిర్మల్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త :



నిర్మల్ జిల్లా ముధోల్ మండల కేంద్రంలోని బుద్ధనగర్ కాలనీలో రోడ్డు వెనుకభాగాన ఉన్న ఇళ్లలో మురికి కాలువలు నిర్మించాలని ప్రజాప్రతినిధులను మంగళవారం రోజు కాలనీవాసులు కలిసి పేర్కొన్నారు. ఈ కాలనీలో చాలా ఏళ్లక్రితం ఇళ్లు కట్టినప్పటికీ మురికి కాలువలు సైతం నిర్మించకపోవడంతో రోడ్డుపైన నిలిచి దుర్గంధం వెదజల్లుతుందని కాలనీవాసులు పేర్కొంటున్నారు. దీంతో దోమల బెడద ఎక్కువై కాలనీవాసులు అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలోనే పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించామని వారు పేర్కొన్నారు. ఇక్కడి ప్రదేశాన్ని సందర్శించి కాలువ నిర్మాణం ఏర్పాటుకు కృషి చేయాలని వారు కోరారు. ఎన్నో ఏళ్లుగా ఇక్కడ ఉంటున్నామని, మురికి కాలువలు నిర్మించకపోగా , ఇక్కడే సీసీ రోడ్డు నిర్మించడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మురికి కాలువలు నిర్మించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

## ఆయిల్‌ఫామ్ సాగుపై రైతులకు అవగాహన

నిర్మల్ రూరల్, ప్రభాతవార్త :



నిర్మల్ మండలంలోని న్యూపోచంపాడ్ గ్రామంలో ఆయిల్‌ఫామ్ సాగుపై రైతులకు మంగళవారం రోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ ఆయిల్‌ఫామ్ సాగుకు ఖర్చు తక్కువగా ఉంటుందని, దీంతో నిరంతర దిగుబడితో పాటు రైతులకు లబ్ధిపొందే అవకాశం ఉందని అన్నారు. చీడపీడల బాధ తక్కువగా కూడా ఉంటుందని, పంటసాగుకు ప్రభుత్వం సబ్సీడీ కలిపిస్తుందని ఏఈఓ శ్రావ్య, ఉద్యాన శాఖ క్లస్టర్ ఆఫీసర్ ప్రణీత్ రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# సీపీఐ ప్రజాగర్జన బహిరంగ సభను జయప్రదం చేయండి

**-సిపిఐ బెల్లంపల్లి నియోజకవర్గ ఇంచార్జి రేగుంట చంద్రశేఖర్**

*బెల్లంపల్లి, ప్రభాతవార్త*



భారత కమ్యూనిస్టు పార్టీ బెల్లంపల్లి పట్టణ సమితి ఆధ్వర్యంలో జూన్ 4వ తేదీన కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో జరగబోయే సీపీఐ ప్రజాగర్జన బహిరంగ సభ పోస్టర్లను మంగళవారం రోజున భారత కమ్యూనిస్టు పార్టీ ఆఫీస్ కామ్రేడ్ భాశెట్టి గంగారాం విజ్ఞాన భవనంలో బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్ విడుదల చేయడం జరిగింది. రేగుంట చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి, కామ్రేడ్ రాజా, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కునంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, సిపిఐ జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషా, సిపిఐ సీనియర్ నాయకులు పువ్వడా నాగేశ్వరరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ చాడా వెంకటరెడ్డి, సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి, విప్లవ కవి గోరేటి వెంకన్న, విప్లవ గాయకులు వందేమాతరం శ్రీనివాస్:, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ హాజరు అవుతున్నారని అన్నారు. కావున అధిక సంఖ్యలో ప్రజలు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యురాలు కామ్రేడ్ బొల్లం పూర్ణిమ, పట్టణ కార్యదర్శి కామ్రేడ్ గుండా చంద్ర మాణిక్యం, బెల్లంపల్లి మండల కార్యదర్శి కామ్రేడ్ బొంతల లక్ష్మీనారాయణ, జిల్లా సమితి సభ్యులు వెల్తూరి శంకర్, లింగాల అమృత, ఎన్.ఎఫ్.ఐ.డబ్ల్యూ పట్టణ కార్యదర్శి బియ్యాల భవాని, రాజేందర్, కొంకుల రాజేష్, పులిపాక స్వామి దాస్, కుందేళ్ళ శంకర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులకు బెల్లంపల్లిలోనే సింగరేణి క్వార్టర్లు కేటాయించాలి

*బెల్లంపల్లి, ప్రభాతవార్త*



బెల్లంపల్లి ఏరియాలోని సింగరేణి బొగ్గ గనులు ఇతర విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు బెల్లంపల్లి పట్టణంలోని స్టేషన్ రోడ్ కాలనిలో గల క్వార్టర్లను కేటాయించాలని హెచ్ఎంఎస్ సెంట్రల్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ ఎండి ఒజియార్ డిమాండ్ చేశారు. మంగళవారం బెల్లంపల్లి ప్రెస్ క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. స్టేషన్ రోడ్ కాలనీతో పాటు నర్స్ క్వార్టర్స్ ఏరియాలో గల సింగరేణి క్వార్టర్లను యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కొందరు ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేశారని ఆయన ఆరోపించారు. వీటిని ఖాళీ చేయించి ఈ క్వార్టర్లను ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్య సిబ్బందికి బెల్లంపల్లి ఏరియాలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు ఇవ్వాలని ఆయన కోరారు. అంతే కాకుండా బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రిలో వైద్య నిపుణులను నియమించి ఆర్థో, గైనిక్, పిల్లల వైద్య విభాగాలను వెంటనే ప్రారంభించాలని యజమాన్యాన్ని డిమాండ్ చేశారు. శాంతిఖని, కాసిపేట1,1ఏ,2,కేకే ఒసపిల కార్మికులను బెల్లంపల్లి ఏరియాలో విలీనం చేసి సింగరేణి ఏరియా ఆసుపత్రిని సూపర్ స్పెషలిటీ ఆసుపత్రిగా అభివృద్ధి పరచాలని ఆయన కోరారు. ఈ సమస్యలను సింగరేణి యాజమన్యం పరిష్కరించుంటే హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ఈ సమావేశంలో హెచ్ఎంఎస్ కొమురం భీం జిల్లా అధ్యక్షుడు ఎండి గౌసన, ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకటస్వామి, సెంట్రల్ కమిటీ సభ్యుడు అబ్దుల్ ఖాదర్, నాయకులు వినయ్ కుమార్, ఆడెపు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా గర్జన వాల్ పోస్టర్‌లు విడుదల

*రామకృష్ణాపూర్, ప్రభాతవార్త*

పట్టణంలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో జూన్ 4న కొత్తగూడెంలో జరుగు ప్రజా గర్జన పోస్టర్‌ను సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ ఆధ్వర్యంలో మంగళవారం రోజు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాగర్జన సభకు ముఖ్య అతిథులుగా సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ డి.రాజా, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి పాల్గొంటున్నట్లు తెలిపారు. అదేవిధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వం విభజన హామీలను అమలు చేయాలని, అలాగే కోరారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మలు చేయాలని అర్హులైన వారందరికి కొత్త రేషన్ కార్డులు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు దళిత బంధు పారదర్శకంగా కలెక్టర్ ద్వారా ఎంపిక చేయాలని రాష్ట్రంలో



ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని నిరుద్యోగబృతి 3000 చెల్లించాలన్నారు. అలాగే రాష్ట్రంలో పోడు వ్యవసాయం చేసుకుంటున్నా 11 లక్షల ఎకరాలకు పోడు పట్టాలు ఇవ్వాలని తదితర సమస్యలపై సింగరేణి ప్రైవేట కరణకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని ప్రజ గర్జన నిర్వహించడం జరుగుతుంది అని ప్రజా గర్జన సభకు కార్మికులు కర్షకులు మేధావులు పార్టీ ప్రజాసంఘాల శ్రేణులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్, అక్బర్‌అలీ, మిట్టపల్లి పౌల్, వనం సత్యనారాయణ, నక్క వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలకు బాలామృతం ప్లస్ అందించాలి

**- అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్**

*గంగాధర ప్రభాతవార్త:*

పిల్లలు లోప పోషన సమస్యలు ఎదుర్కో కుండా బాలమృతం ప్లస్‌ను అందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ సూచించారు. మంగళవారం గంగాధర మండలం గర్శకుర్తి సెక్టార్ పరిధిలో గట్టుబుత్కూర్ 1,2,3 అంగన్‌వాడి కేంద్రాల్లో నిర్వహించే పిల్లల పెరుగుదల పర్యవేక్షణ రోజు కార్యక్రమానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గరిమా ఆగర్వాల్ ముఖ్య అథితిగా హజరయ్యారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు, పిల్లల యొక్క బరువులు ఆహారపు అలవాట్లు (పోషకాహారం) వ్యక్తగత పరిశుభ్రతల గురించి వివరించారు. లోప పోషణతో బాదపడుతున్న పిల్లల వివరాలు వారి తల్లులను అడిగి తెల్సుకున్నారు. బాలామృతం ప్లస్ పిల్లలకు ఇస్తున్నారా అని అడిగి తెల్సు కున్నారు. బాలమృతం ప్లస్ యొక్క విశిష్టత గురించి తెలిపారు. మహిళలు పాటించా ల్సిన ఆరోగ్య సూత్రాల గురించి హెల్త్ డైరి యాప్ అందరూ డౌన్‌లోడ్ చేసుకో వాలని సూచి ంచారు. ఈ యాప్‌లో గర్భిణి బాలింతలు కిషోర్ బాలికలు తీసు కోవల్సిన జాగ్రత్తలు కూడా ఉన్నాయని తెలిపారు. ఈ కార్య క్రమంలో గ్రామ సర్పంచ్ కంకణాల విజేందర్ రెడ్డి, ఉపసర్పంచ్ శైలజ శ్రీకాంత్, డిడబ్ల్యూఒ సంద్యారాణి, డిపిఒ వీర బుచ్చయ్య, డిఆర్‌డిఒ శ్రీలత, వైస్ ఎంపిపి కంకణాల రాజగోపాల్‌రెడ్డి, ఎంపిడిఒ రాజీవ్ మల్హోత్ర, ఎంఇఒ, హెల్త్ ఆఫీసర్ ఏపిఎం పవన్ ఇతర సిబ్బందిపాల్గొన్నారు.



మంచిర్యాల వార్త

# దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

**చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్**

*గంగాధర ప్రభాతవార్త:*



మండల పరిధిలోని బూర్గుపల్లి గ్రామంలోని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ స్వగృమంలో ఆరు మండలాల ఎమ్మార్వోలు, ఎంపిడిఒలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. దశాబ్ది ఉత్స వాలను ఘనంగా నిర్వహించాలని అన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదేశాల మేరకు షెడ్యూల్‌లో ఉన్న విధంగా దశాబ్ది ఉత్స వాలు నిర్వహించాలని అన్నారు. అనంతరం మిడి డైరి ఫాం యూనిట్ల గురించి చర్చించారు. 58,59 జిఒను పకడ్బందిగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆరు మండలాల ఎంపిడిఒలు పాల్గొన్నారు.

# కరీంనగర్ జిల్లా బిజేపి నూతన కార్యవర్గ సభ్యులుగా శ్రీపతి చంద్రశేఖర్

*గంగాధర ప్రభాతవార్త:*



మండల పరిధిలోని గర్శకుర్తి గ్రామానికి చెందిన సినయర్ బిజేపి నాయకులు శ్రీపతి చంద్రశేఖర్‌ను జిల్లా కార్యవర్గ సభ్యులుగా నియమిస్తూ జిల్లా బిజేపి అద్యక్షులు గంగాడి కృష్ణారెడ్డిఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ బిజేపి పార్టీ బలోపేతం కోసం అదేవిధంగా బిజేపి పార్టీని ప్రజలకు చేరువ చేయండి,కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయడం కోసం కష్టపడి పని చేస్తానని అన్నారు. ఎన్నికకు సహకరించిన కరీంనగర్ ఎంపి తెలంగాణ రాష్ట్ర అద్యక్షులు బండి సంజయ్‌కుమార్‌కు, మాజీ మంత్రి సుద్దాల దేవయ్యకు, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభక్క గాలన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్, కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్‌రావు, చొప్పదండి అసెంబ్లి కన్వీనర్ పేరుక శ్రావణ్‌కుమార్, కోల అశోక్, మండల కార్యదర్శిలకు ధన్యవాదాలు తెలిపారు.

# సిఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

*జమ్మికుంట, ప్రభాత వార్త:*

సోమవారం జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సర్వీస్ క్రమబద్ధీకరణ ప్రక్రియ ప్రారంభించిన నేపథ్యంలో మంగళవారం జమ్మికుంట మండల ప్రజా పరిషత్ కార్యక్రమంలో సిఎం కేసీఆర్ చిత్రపటానికి జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సిఎం కేసీఆర్ మండల జూనియర్ పంచాయతీ కార్యదర్శులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా జమ్మికుంట మండల జడ్‌పిటిసి డాక్టర్ శ్రీరామ్ శ్యాం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు గుడి మనోహార్ రెడ్డి, సురేష్, శ్రీనివాస్, మధు, సుమలత, శివ, రంజని, సంతోష్, సందీప్ రాజు, ఐలోని, శ్రీనివాస్ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బహుజనుల ఫ్లెక్సీలు తొలగించటమే బహుజనవాదమా

**- అదికారపార్టీకి ఒక రూల్ ప్రతిపక్షానికి మరో రూలా**
**- ఫ్లెక్సీల తొలగింపుపై కాంగ్రెస్ నాయకుల ఆందోళన**





మంథని - ప్రభాతవార్త

మంథని పట్టణంలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన బహుజనులు ఫ్లెక్సీలు కట్టుకుంటే 24గంటలు గడవకముందే అధికారపార్టీ వారు మున్సిపల్ సిబ్బందితో తొలగించటం బహుజనవాదం కాదని అధికార పార్టీ దిగజారుడు తనానికి నిదర్శనమని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. మంగళవారం మంథని అంబేడ్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు మున్సిపల్ అధికారుల చర్యలను నిరసిస్తూ రాస్తారోకోనిర్వహించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ తమ నాయకుడు ఏఐసిసి కార్యదర్శి శ్రీధర్‌బాబు కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటులో కీలకభూమిక పోషించి తిరిగి మంథనికి వచ్చిన సందర్బంగా కాంగ్రెస్‌పార్టీవారు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను 12గంటలు గడవకముందే మున్సిపల్ సిబ్బందిద్వార అధికార పార్టీనాయకులు తొలగించివేయటం పట్ల కాంగ్రెస్ పార్టీ అంటే వారు ఎంత బయపడుతున్నారో తెలుస్తుందన్నారు. ఇదే అంబేడ్కర్ చౌరస్తాలో బిఆర్ఎస్ పార్టీకి చెందిన వారి ఫ్లెక్సీలు నెలల తరబడి ఉన్నా వాటిని మున్సిపల్ సిబ్బంది ఎందుకు తొలగించటం లేదని వారు ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీలు తొలగించినంత మాత్రానా ప్రజల హృదయాల్లోనుండి కాంగ్రెస్ పార్టీని శ్రీధర్‌బాబు తొలగించలేరన్నారు. ఎస్సీ, బీసీ నాయకులు కట్టుకున్న ఫ్లెక్సీలను తొలగించటం బహుజనవాదం కాదని బహుజనులంటే కేవలం బిఆర్ఎస్ పార్టీలో ఉన్నవారు కాదన్నారు. మున్సిపల్ కమీషనర్ ఏకపక్షంగా వ్యవహరించటాన్ని తాము జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని వారు పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో అందరిని సమానంగా చూడాల్సిన అవసరం మున్సిపల్ కమీషనర్‌కు ఉంటుందన్నారు. అనంతరం తాహసీల్దార్ కార్యాలయం వద్దకు ర్యాలీగా వెళ్లి తాహసీల్దార్ బండి ప్రకాశ్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సెగ్గెం రాజేశ్, డిసిసి అధికార ప్రతినిధి ఇనుముల సతీష్, జిల్లా కిసాన్ సెల్ చైర్మన్ ముస్కుల సురేందర్‌రెడ్డి, కాం గ్రెస్ నాయకులు పోలు శివ, మంథని సత్యం, రాం రాజశేఖర్, సీమంతుల ఓదెలు, పర్వతాలు యాదవ్, మంథని సురేష్, శ్రీనివాస్, పెంటరి రాజు, భండారి ప్రసాద్, మోహన్, ఎరుకల ప్రవీణ్, వేల్పుల రాజు, అలీం, ఇందారపు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# టిసిఎస్ వ్రాత పరీక్షకు ఆసక్తి గల యువతీ, యువకులు హాజరు కావాలి

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త.

మే 25న టిసిఎస్ రిక్రూట్మెంట్ డ్రైవ్‌లో భాగంగా ఓబిసి ట్రైనీ పొజిషన్ కోసం వ్రాత పరీక్ష నిర్వహిస్తుందని, ఆసక్తి, అర్హత గల యువతీ, యువకులు పాల్గొనాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.సంగీత సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ వారు అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల కోసం కరీంనగర్‌లోని వివేకనంద డిగ్రీ, పిజి కళాశాలలోని బిపిఓ ట్రైనీ కోసం రిక్రూట్మెంట్ డ్రైవ్ కోసం వ్రాత పరీక్ష నిర్వహిస్తున్నారని, న్యూమరికల్ ఎబిలిటీ, వెర్బల్ ఎబిలిటీ, కాంప్రెహెన్షన్ రీడింగ్, రీజనింగ్ ఎబిలిటీకి సంబంధించి 80 ప్రశ్నలకు 65 నిమిషాల సమయంతో వ్రాత పరీక్ష నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 2021 నుంచి 2023 సంవత్సరాల వరకు పాసైన బిబిఎ, బికాం, బిఎస్సీ జనరల్ , బిఎ, బిబిఎం, బిఎఎఫ్, బిబిఐ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు, అకాడమిక్‌లో 50శాతం, ఐదు కంటే ఎక్కువ సిజిపిఎ వచ్చి విద్యార్థులు మే 25న ఉదయం9గంటలకు వ్రాత పరీక్ష కోసం హాజరు కావాలని, పరీక్షకు హాజరయ్యే యువతీ, యువకులు పాస్ పోర్టు సైజ్ ఫొటో, టిసిఎస్ దరఖాస్తు ఫారం, రెజూ్యమ్, ప్రభుత్వ ఫొటో గుర్తింపు కార్డు,



పదవ ఇంటర్ మార్క్ షీట్, గ్రాడ్యుయేషన్ సెమిస్టర్‌ల వారీగా మార్క్ షీట్లు, డిగ్రీ సర్టిఫికేట్‌లు ఒరిజినల్ తీసుకొని రావాలని తెలిపారు. వ్రాత పరీక్షలో రాణ ఇంచిన వారికి ఇంటర్వ్యూ నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందని, జిల్లాలో ఆసక్తి, అర్హత కలిగిన యువతీ, యువకులు లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఇతర వివరాలకు సెల్ నెంబర్ 9849737313కి సంప్రదించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

# సిద్దపల్లి నుండి అక్రమంగా ఎర్రమట్టి రవాణా

**- అక్రమంగా మట్టి దందా చేస్తున్న వారిపై చర్యలు లేవా**

మంథని రూరల్ - ప్రభాతవార్త



మంథని మండలం సిద్దపల్లి గ్రామం నుండి అక్రమంగా ఎర్రమట్టిని కొంతమంతి అక్రమార్కులు యధేచ్చగా తరలిస్తున్నారు. సిద్దపల్లి గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు ట్రాక్టర్లద్వార రాత్రి సమయంలో తెల్లవారు జామున ఇష్టారాజ్యంగా ఎర్రమట్టిని అ క్రమంగా రవాణా చేస్తున్నారు. ప్రభుత్వ భూమిలో ఎర్రమట్టిని తవ్వుతూ యధేచ ్ఛగా తరలిస్తున్నారు. మంగళవారం సిద్దపల్లి గ్రామం నుండి మంథని మున్సిపల్ పరిధిలోని గంగాపురి గ్రామానికి అనేక ట్రాక్టర్లతో ఎర్రమట్టిని అక్రమంగా తరలించారు. ఎర్రమట్టి అక్రమ రవాణా చేస్తున్న వారి వివరాలు తెలిసినను సంబంధిత అధికారులు వారిపైన ఏలాంటి చర్యలు తీసుకోవటం లేదని ప్రజలు వాపోతున్నారు. అక్రమంగా తరలించే ఎర్రమట్టి ట్రాక్టర్లు రాత్రి సమయంలో, తెల్లవారుజాములో అతి వేగంగా నడపటంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని వీటిపైన సంబంధిత అధికారులు సత్వరమే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# విజయవంతంగా ఎస్‌సిఇయు రాష్ట్ర మహాసభలు

గోదావరిఖని, ప్రభాతవార్త.



గోదావరిఖని కేంద్రంగా రెండు రోజుల పాటు జరిగిన సిఐటియు అనుబంధ సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర 16వ మహాసభలు విజయవంతంగా జరిగాయని యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి అన్నారు. గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాసభలకు సహకారాలు అందించి విజయవంతానికి కృషి చేసినందుకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ మహాసభల సందర్భంగా 18 మందిని రాష్ట్ర ఆఫీస్ బేరర్స్‌గా, 25 మందిని రాష్ట్ర కమిటీ సభ్యులుగా, మొత్తం 43 మందితో రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మరోసారి గౌరవ అధ్యక్షులుగా ఈ.రాజారావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా తుమ్మల రాజారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మంద నర్సింహా రావు, డిప్యూటీ జనరల్ సెక్రటరీగా ఎస్.నాగరాజు గోపాల్, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బి.మధు, రాష్ట్ర కోశాధికారిగా వై.వెంకటేశ్వర్లుతోపాటు పలువురిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై తీర్మానాలు చేయడం జరిగిందని, వాటి పరిష్కారం కోసం భవిష్యత్ పోరాటాలుంటాయని తెలిపారు. సమావేశంలో నాయకులు మేదరి సారయ్య, మెండే శ్రీనివాస్, ఆసరి మహేష్, ఎస్‌కె.గౌస్, ఆరెపల్లి రాజమౌళి, దాసరి సురేష్, మామిడాల శ్రీహరి, ఐ.రమేష్, జి.శంకర్, ఇప్పల్లపల్లి సతీష్ కుమార్, జె.మల్లేష్, రాజయ్య తదితరులున్నారు.

# నాణ్యమైన బొగ్గుతో ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలి

**- సింగరేణి డైరెక్టర్ ఆపరేషన్స్ ఎన్‌వికె శ్రీనివాస్**

యైటింక్లయిన్‌కాలనీ, ప్రభాతవార్త.



నాణ్యమైన బొగ్గుతో సింగరేణి నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలని సంస్థ డైరెక్టర్ ఆపరేషన్స్ ఎన్‌వికె శ్రీనివాస్ అన్నారు. సింగరేణి ఆర్జీ 2 జిఎం కార్యాలయంలో మంగళవారం డైరెక్టర్ ఆపరేషన్స్ ఎన్‌వికె శ్రీనివాస్ ఆర్జీ 1 జిఎం చింతల శ్రీనివాస్, ఆర్జీ 2 జిఎం ఎ.మనోహర్‌తో కలిసి ఆర్జీ 2 ఏరియా ఓసిపి 3, ఆర్జీ 1 ఏరియా ఓసిపి 5 పని స్థలాలను పరిశీలించారు. ముందుగా సర్వే మ్యాప్ ద్వారా పని స్థలాలను పరిశీలించి, ఓసిపి 3, ఓసిపి 5 ఉత్పత్తి, ఉత్పాదకత వివరాలను అడిగి తెలుసుకున్నారు. రాబోయే రోజుల్లో డిమాండ్‌కు తగ్గట్లుగా బొగ్గు ఉత్పత్తికి ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. వ్యూపాయింట్ ద్వారా ఓసిపి 3 పని స్థలాలను పరిశీలించిన అనంతరం ప్రాజెక్ట్ కార్యాలయంలో ప్రాజెక్ట్ అధికారులతో సమావేశమై గనికి కేటాయించిన లక్ష్యాలు, అందుకు చేపట్టాల్సిన ప్రణాళికలు, తదితర విషయాలపై చర్చించారు. సమావేశంలో ఓసిపి 3 ప్రాజెక్ట్ అధికారి మధుసూదన్, ఓసిపి 5 ప్రాజెక్ట్ అధికారి చంద్రశేఖర్, ప్రాజెక్ట్ ఇంజనీర్ దుర్గాప్రసాద్, ఓసిపి 3 మెనేజర్ డి.రమేష్, ఓసిపి 3 సర్వే అధికారి నర్సింగ రావు, ఓసిపి 5 సర్వే అధికారి అలీ, సీనియర్ సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి తదితరులున్నారు.

# ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్

**-సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్ కమిటీ ఏర్పాటు**

యైటింక్లయిన్‌కాలనీ, ప్రభాతవార్త.



ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ కేంద్ర కమిటీ ఆదేశాల మేరకు సింగరేణి ఆర్జీ 2 ఏరియాలో పని చేస్తున్న సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్ కమిటీని మంగళవారం ఏర్పాటు చేశారు. పానుగంటి రాజలింగం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఆర్జీ 2 ఏరియా ఉపాధ్యక్షులు బొక్కల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన నూతన కమిటీని అభినందించారు. నూతనంగా ఎన్నికైన ఫిట్ సెక్రటరీ అరుకాల శ్రీనివాస్‌కు నియామకపు ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిటీలో ఉన్న సామాజిక వర్గానికి ఎలాంటి సమస్యలు వచ్చినా ముందుండి పరిష్కరించాలని తెలిపారు. సింగరేణిలో సెక్యూరిటీ విభాగం ఎంతో కీలకమైందని, సంస్థ ఆస్తులను రక్షించేందుకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. కమిటీలో ట్రెజరర్‌గా రత్నం దేవదాసు, ముఖ్య సలహాదారునిగా జాడి వెంకటి, మూడు షిఫ్ట్‌ల ఇన్‌ఛార్జిలుగా లింగాల శ్రీనివాస్, సల్లం శ్రీనివాస్, ఎలబోతారం సారయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా బానోత్ పర్శ నాయక్, టి.సంజీవ్ రావు, గూడేపు రవీందర్‌లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఆర్జీ 2 ట్రెజరర్ ఈదునూరి మహేందర్, సెక్యూరిటీ సిబ్బంది ఉన్నారు.

# పలు కుటుంబాలను పరామార్శించిన జడ్పీ చైర్మన్

మంథని రూరల్ - ప్రభాతవార్త



మండలంలోని రచ్చపల్లి గ్రామంలో ఇటీవల ఆనారోగ్యంతో మరణించిన కనవేన సాయమ్మ కుటుంబాన్ని మంగళవారం జడ్పీ చైర్మన్ పుట్ట మధు పరామార్శించారు. అదేవిధంగా గ్రామానికి చెందిన జనగామ అరుణజ్యోతి, కనవేన గోపిలు ఇటీవల వైద్య చికిత్సపొంది ఇంట్లో విశ్రాంతితీసుకుంటుండగా వారిని పరామార్శించారు. ఆయన వెంట సర్పంచ్ కనవేన శ్రీనివాస్‌తో పాటు పలువురు బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూమ్ పేరుతో బీఆర్ఎస్ నాయకులు డబ్బులు వసూళ్లు

**-బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి**

బేల, ప్రభాతవార్త:

డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో బీఆర్ఎస్ నాయకులు డబ్బులు వసూలు చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి ఆరోపించారు. ప్రజా సమస్యలపై పోరాటానికి వస్తున్న మీ అడపడుచుగా కార్యక్రమంలో భాగంగా మండలంలోని శంషాబాద్ గ్రామంలో



మంగళవారం ఆమె పర్యటించారు. ఈసందర్భంగా గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అలాగే గ్రామంలో సమస్యలు పరిష్కరించడంలో ఎమ్మెల్యే పూర్తిగా విఫలమయ్యారని, వెంటనే సమస్యలు పరిష్కరించాలని ఆమె డిమాండ్ చేశారు. ఆమె వెంట మండల అధ్యక్షులు దత్త నిక్కమ్, ప్రదీప్, విజయ్ వాంఖడే, కిషోర్, రవీంద్ర, సతీష్ పాల్గొన్నారు.

## జైనథ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అల్ట్రా సోనోగ్రఫీ స్కానింగ్

జైనథ్, ప్రభాతవార్త:



మండల కేంద్రమైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం రేడియాలజిస్ట్ డాక్టర్ విక్రమ్ రేడియాలజిస్ట్‌చే 58 మంది గర్భిణులకు అల్ట్రా సోనోగ్రఫీ స్కానింగ్ క్యాంపు నిర్వహించారు. ఇందులో భాగంగా యొక్క గర్భిణీలకు ఆహారం ఇవ్వడం జరిగింది. ఈకార్యక్రమంలో డాక్టర్ విక్రమ్ రేడియాలజిస్ట్, డాక్టర్ నయనతా, సూపర్‌వైజర్, ఏఎన్ఎంలు, జీఎన్ఎంలు, ఆశావర్కర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## సాదాసీదాగా కొనసాగిన మండల సర్వసభ్య సమావేశం

జైనథ్, ప్రభాతవార్త:



మండల కేంద్రమైన జైనథ్‌లో గల రైతు వేదిక భవనంలో మండల ఎంపీపీ ఏం గోవర్దన్ అధ్యక్షతన మంగళవారం జరిగిన జైనథ్ మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా కొనసాగింది. ఈసందర్భంగా ఆయా శాఖల అధికారులు తమ సంపూర్ణ నివేదికను సర్పంచులకు, ఎంపీటీసీలకు చదివి వినిపించారు. ఈసందర్భంగా ఎంపీపీ గోవర్దన్ మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ అన్ని వర్గాల ప్రజలకు లబ్ది చేకూరుతుందని స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో జడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ సావాపూరి విజయ్ కుమార్, డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్‌రెడ్డి, జైనథ్ మండల తహసీల్దార్ రాఘవేంద్రరావు, ఎంపీడీఓ గజానంద్‌రావులతో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వృద్ధులకు నిత్యావసర సరుకులు అందజేత

ఆదిలాబాద్, ప్రభాతవార్త:



తలమడుగు మండల కేంద్రంలోని బ్లూ బీమ్ యూత్ ఆధ్వర్యంలో నిరుపేద వృద్ధులకు నిత్యావసరాలు, వస్తువులను పంపిణీ చేయడం చేశారు.ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తలమడుగు ఎస్సై అప్పారావు హాజరై మాట్లాడారు. బ్లూ బీమ్ సేవలు భేష్ అని, వృద్ధులను దృష్టిలో ఉంచుకొని ఇలాంటి సేవ కార్యక్రమం ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు.అనంతరం యూత్ అధ్యక్షుడు ప్రేమేందర్ మాట్లాడుతూ సామాజిక సేవ కార్యక్రమంలో భాగంగా గత 2 సంవత్సరాల నుంచి వివిధ కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు ప్రేమేందర్, శేఖర్, అరవింద్, ప్రసాద్, గోపి, రూపేందర్, సురేష్, సంతోష్, రాములు, వినోద్, గంగన్న, వృద్ధులు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమంలో పంచాయతీ సెక్రటరీలు పండ్ల పంపిణీ

ఆదిలాబాద్, ప్రభాతవార్త:



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులైజేషన్ చేయడంతో తలమడుగు మండలంలోని జూనియర్ పంచాయతీ సెక్రటరీలు మంగళవారం సాయి వృద్ధాశ్రమంలో వృద్ధులకు పాలు, పండ్లను యూనియన్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీఓ దిలీప్‌కుమార్ హాజరయ్యారు. ఇప్పటి వరకు ఎలాగైతే కష్టపడ్డారో ఇక ముందు కూడా అలాగే కష్టపడుతూ ప్రతి గ్రామాన్ని అభివృద్ధి దిశలో మార్చడానికి కృషి చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో మండల పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

## రక్తదానం చేసిన యువకులు

ఆదిలాబాద్, ప్రభాతవార్త:



ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. చైర్మన్ పుట్టిన రోజును పురస్కరించుకొని పలు సామాజిక సేవ కార్యక్రమాలను నిర్వహించి అభిమానాన్ని చాటుకున్నారు. ఇందులో భాగంగానే మానవ సేవే దేవుని సేవ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు సాయిని రవికుమార్ ఆధ్వర్యంలో రిమ్స్‌లోని రక్తనిధి కేంద్రంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సాయిని ప్రవీణ్, బారే శ్రీధర్, చంద్రకాంత్, శ్రీను, సాయిని, ప్రవీణ్ పాల్గొన్నారు.

## సీఎం కప్ మొదటి బహుమతి గెలుచుకున్న జైనథ్ మండలం

జైనథ్, ప్రభాతవార్త:



జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో మంగళవారం నిర్వహించిన కబడ్డీ పోటీల్లో మొదటి బహుమతిగా మండలానికి చెందిన జట్టుకు అధికారులు, నాయకులు సీఎం కప్‌ను అందజేశారు. జైనథ్ మండలంలోని మాంగుర్ల గ్రామానికి చెందిన ఎడమ వైష్ణవి 400 మీటర్ల పరుగు పందెంలో మొదటి బహుమతి సాధించగా, 100 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ బహుమతిగా అందజేశారు.జైనథ్ మండల ఉన్నత పాఠశాల పీడీ ఏ దయానందరెడ్డి రూ.3వేలు అందజేసి అభినందించారు. ఈకార్యక్రమంలో ఒలంపిక్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు బాలూరి గోవర్ధన్‌రెడ్డి, పీడీ సాయి, క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి, తహసీల్దార్ వనజారెడ్డి పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ వార్త

**మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్**

## నూతన గృహ ప్రవేశంలో పాల్గొన్న జడ్పీ చైర్మన్

ఉట్నూర్, ప్రభాతవార్త:



మండలంలోని లక్కారం గ్రామంలోని రాజా దేవుషాగూడకు చెందిన శిరీష్ నూతన గృహ ప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆదిలాబాద్ జడ్పీ చైర్మన్ జనార్ధన్ రాథోడ్ హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో ఆత్రం గంగాధర్ (దొర), లక్కారం మాజీ సర్పంచ్ మర్సకోల తిరుపతి, గంట విజయ్ కాల్వ రవి అరిపెల్లి గంగాధర్, సబ్బుల రాజన్న, తిరుపతి ముంజమ్ గంగేశ్వర్ పాల్గొన్నారు.

## మెరుగైన వైద్యం అందించాలి

ఉట్నూర్, ప్రభాతవార్త:



మండలంలోని హస్నాపూర్ గ్రామానికి చెందిన నిరుపేద రైతు జాదవ్ విక్కీ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండగా ఈ విషయాన్ని పూర్ణ యువసేన సభ్యుల ద్వారా తెలుసుకున్న బీఆర్ఎస్ యువ నాయకులు, నియోజక వర్గ లోకల్ ముద్దుబిడ్డ బాధవత్ పూర్ణ చందర్ నాయక్ సోమవారం సాయంత్రం జాదవ్ విక్కీ కుటుంబ సభ్యులతో చరవాణిలో మాట్లాడి పూర్తి వివరాలు సేకరించి, ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో గల రిమ్స్ ఆస్పత్రికి వెళ్లాలని వారికి సూచించారు. అనంతరం రిమ్స్ ఆస్పత్రి వైద్యులతో మాట్లాడుతూ జాదవ్ విక్కీ ఆరోగ్య పరిస్థితి గురించి వారికి వివరించారు. జాదవ్ విక్కీకి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను వారిని కోరారు.

## కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించిన సర్పంచ్

జైనథ్, ప్రభాతవార్త:



మండలంలోని లేఖరువాడ గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. ఈక్యాక్రమాన్ని గ్రామ సర్పంచ్ చందా మమత విఠల్ ప్రారంభించారు. చంద మమత మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో జైనథ్ పీహెచ్‌సీ డాక్టర్ నయనతా, సూపర్‌వైజర్ వేణుగోపాల్, సుశీల, ఉపసర్పంచ్, పంచాయతీ సెక్రటరీ కంటి వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

## అడెల్లి మహాపోచమ్మను దర్శించుకున్న జిల్లా జడ్పి చైర్మెన్ విజయలక్ష్మి

సారంగాపూర్, ప్రభాతవార్త :



నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండల కేంద్రంలోని అడెల్లి శ్రీ మహాపోచమ్మ అమ్మవారిని మంగళవారం రోజు నిర్మల్ జిల్లా జడ్పి చైర్‌పర్సన్ కొరిపెల్లి విజయలక్ష్మి రాంకిషన్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటి చైర్మెన్ ఐటి చందు, కమిటి సభ్యులు జడ్పి చైర్మెన్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు జడ్పి చైర్మెన్ విజయలక్ష్మికి శాలువతో ఘనంగా సన్మానించారు. అలాగే అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

# బిజెపి జిల్లా కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయండి

**చందుర్తి, ప్రభాతవార్త :**



చందుర్తి మండల కేంద్రంలో బుధవారం జరగబోయే జిల్లా బిజెపి కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్ అన్నారు. మంగళవారం చందుర్తి మండల కేంద్రంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ నేతృత్వంలో రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి కార్యకర్తలు నిరంతరం శ్రమిస్తున్నారని ఇందుకోసమే సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మంచి మెజారిటీతో రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే దిశగా రాష్ట్ర నాయకత్వం దిశానిర్దేశం చేస్తుందని, ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ మార్త సత్తయ్య, జిల్లా ఉపాధ్యక్షులు సిరికొండ శ్రీనివాస్, ఓబిసి జిల్లా అధ్యక్షుడు నంద్యాడపు వెంకటేష్, మండల అధ్యక్షులు పొంచెట్టి రాకేష్, నాయకులు చింతకుంట గంగాధర్, చిర్రం తిరుపతి, పెరుక గంగరాజు, చింతకుంట సాగర్, పెరుక రంజిత్, కూతురు మహేందర్‌రెడ్డి, మేడిశెట్టి శ్రీహరి, సిరికొండ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగుల పక్షపాతి

**జడ్పి చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ**

సిరిసిల్ల టౌన్ ప్రభాతవార్త



తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగుల పక్షపాతి అని జడ్పి చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. మంగళవారం గ్రామపంచాయితి కార్యదర్శులు రెగ్యూలర్ చేసినందుకు జడ్పి చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణకు కార్యదర్శులు మర్యదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగుల పక్షపాతి అని మరోసారి రుజువు అయిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల పట్ల స్నేహ పూర్వక సంబంధాన్ని కలిగి ఉందన్నారు. సమస్యల పరిష్కారంలో ముందుంటామని అన్నారు. స్వరాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల సముచిత స్థానం కల్పించడం జరుగుతుందన్నారు. బంగారు తెలంగాణ సాధనలో ఉద్యోగుల పాత్ర చాల ముఖ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ పంచాయితీ కార్యదర్శులు ఉన్నారు.

## సిఎం కేసీఆర్‌కు కృతజ్ఞతాభివందనాలు

సిరిసిల్ల టౌన్ ప్రభాతవార్త



తెలంగాణ పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ సమస్యలకు పరిష్కారం చూపుతూ పంచాయితీరాజ్ ఉద్యోగుల మనోధైర్యాన్ని పెంచుతు శాఖ పునర్వ్యవస్థీకరణకు ఆమోద ముద్ర వేసినందుకు సిఎం కేసిఆర్‌కు జిల్లా పంచాయితీ రాజ్ శాఖ సంఘం అధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు సూర్యప్రకాష్ కృతజ్ఞతాభివందనాలు తెలిపారు. మంగళవారం సమీకృత కార్యలయంలో కూడలి వద్ద కృతజ్ఞతాభివందనాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఇంజనీరంగ్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు.

## పచ్చకామెర్లతో పదో తరగతి విద్యార్థిని మృతి

**-విషాదంలో కుటుంబం**

కోనరావు పేట, ప్రభాతవార్త



అందరి విద్యార్థినిలతో కలిసి పదో తరగతి చదువులో ఉత్తమ ఫలితాలు సాధించగా, ఉన్నత చదువులు చదివించేందుకు తల్లిదండ్రులు ప్రయత్నాలు చేస్తుం డగా, పచ్చకామెర్లు ఆ ఇంటిలో విషాదాన్ని నింపిన ఘటన కోనరావుపేట మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సుతారి భాగ్య-శ్రీనివాస్ రెండో కూతురు సుతారి సిరివెన్నెల(15) అనే విద్యార్థిని పచ్చకామెర్లతో మృతి చెందింది. స్థానికంగా పదో తరగతి చదువుతున్న సిరివెన్నెల మొన్న వెలువడిన పదో తరగతితో మంచి మార్కులు సాధించింది. పక్షం రోజులుగా అనారోగ్యం బారిన పడడంతో గమనించిన తల్లిదండ్రులు కరీంనగర్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి, చికిత్స చేయిస్తున్నారు. కానీ వ్యాధి నయం కావడంతో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం కన్నుమూసింది. దీంతో కుటుంబంలో విషాదాన్ని నింపింది. కూతురును కాపాడుకునే క్రమంలో ఇబ్బందులు పడ్డ శ్రీనివాస్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసిన జేపీఎస్‌లు

**తంగళ్లపల్లి, ప్రభాతవార్త :**

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షిస్తూ తంగళపల్లి మండలంలోని పద్మనగర్‌లో మంగళవారం ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ల చిత్రపటాలకు జేపీఎస్‌లు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య



అతిథిగా హాజరైన ఎంపీపీ పడగల మానస మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జేపీఎస్‌లను రెగ్యూలరైజ్ చేయడం సంతోషకరమన్నారు. క్రమబద్ధీకరణ ఆదేశాలు జారీ చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మాట్ల మధు, సర్పంచులు ముదారి పోచయ్య, అనిత, వేణుగోపాలరావు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యశాఖ సహకార సంఘం అధ్యక్షులుగా పిట్టల బాబు

**చందుర్తి, ప్రభాతవార్త :**

చందుర్తి మండల కేంద్రంలో మత్స్యశాక సహకార సంఘం ఎన్నికలు మంగళవారం జరిగాయి. తొమ్మిది మంది డైరెక్టర్లను సోమవారం ఎన్నుకున్నారు. మంగళవారం అధ్యక్షునిగా పిట్టల బాబు ఉపాధ్యక్షులుగా రేగుల శంకర్, క్యాషియర్‌గా గామ రాజులు ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా ఎడ్ల అంజయ్య, ఎడ్ల శ్రీనివాస్, పల్ల తిరుపతి, పల్ల శంకర్, మటకం దేవయ్య, మోతె రాములు, రేగుల శంకర్‌లు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి వినోద్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోతె బాబు, మోతె రాములు సంఘం సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు పిట్టల బాబు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి గెలిపించిన డైరెక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు. పిట్టల బాబు మూడవసారి అధ్యక్షునిగా ఎన్నికయ్యారు.

## కంటి వెలుగును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి

**- ఎంపీపీ పడగల మానస**

**తంగళపల్లి, ప్రభాతవార్త :**



తంగళపల్లి మండలంలోని ఇందిరానగర్‌లో కంటి వెలుగును ఎంపీపీ పడగల మానస మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కంటి వెలుగును గ్రామస్తులందరూ వినియోగించు కోవాలన్నారు. కంటి వెలుగుతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. ఇంత మంచి కార్యక్రమాన్ని తలపెట్టిన ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగరాజు, డాక్టర్ రేఖ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి రామచంద్ర ఆలయంలో జడ్పీటీసీ

**చందుర్తి, ప్రభాతవార్త :**



భద్రాచలంలోని శ్రీసీతారా మచంద్ర స్వామి ఆలయంలో చందుర్తి జడ్పిటిసి సభ్యులు నాగం కుమార్-మమత దంపతులు మంగళ వారం కుటుంబ సమేతంగా దర్శించు కుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జడ్పీటీసీకి స్వాగతం పలికి స్వామివారి మండ పంలో ఆశీర్వచనం ఇచ్చారు. అలాగే పర్ణశాలను కూడా దర్శించుకున్నారు.

## అగ్ని ప్రమాదంలో పూరి గుడిసె దగ్ధం...

**చందుర్తి, ప్రభాతవార్త :**



చందుర్తి మండలం మూడపల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధమైంది. గ్రామానికి చెందిన కట్కూరి లింగయ్యకు చెందిన పూరి గుడిసె మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా మంటలు వ్యాప్తి చెందడంతో స్థానికులు గమనించి మంటలను ఆర్పి వేశారు. ప్రమాదంలో గుడిసెలో ఉన్నటువంటి సామాగ్రి మొత్తం పూర్తిగా కాలి బూడి దైందని బాధితుడు తెలిపారు. లింగయ్యకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారని బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచి చిలుక అంజిబాబు కోరారు. నిరుపేద కుటుంబానికి చెందిన లింగయ్యకు ఆధారం పూరి గుడిసె అగ్ని ప్రమాదంలో కాలి బూడిద కావడంతో ప్రస్తుం ఉండటానికి కూడా ఇల్లులేదని రాష్ట్ర ప్రభుత్వం స్పందించి డబుల్ బెడ్‌రూంను మంజూరు చేయాలని గ్రామ సర్పంచి చిలుక అంజిబాబు, గ్రామస్తులు కోరుతున్నారు.

## గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో ప్రతిభను వెలికి తీసేందుకే సిఎం కప్ పోటీలు

గోదావరిఖని, ప్రభాతవార్త.



గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో ప్రతిభను వెలికి తీసేందుకే సిఎం కప్ 2023 పోటీలను నిర్వహిస్తున్నారని బిఆర్ఎస్ నాయకురాలు, పాలకుర్తి జడ్పిటిసి కందుల సంధ్యారాణి అన్నారు. యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో జవహార్ లాల్ నెహ్రు స్టేడియంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి పోటీలకు మంగళవారం బిఆర్ఎస్ నాయకురాలు కందుల సంధ్యారాణి హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ పోటీలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తుందని, పెద్దపల్లి జిల్లాలోని మండల స్థాయిలో గెలిచి, జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారులు అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కొమురం శ్రీనివాస్, సురేష్, సురేందర్, శ్రీనివాస్, శోభారాణి, రేణుక, మాధవి, కవిత తదితరులున్నారు.

## ముఖ్యమంత్రి సానుకూల దృక్పంథంపై జెపిఎస్ హర్షం

మంథని రూరల్ - ప్రభాతవార్త

జూనియర్ పంచాయితీ కార్యదర్శులను రాష్ట్ర ప్రభుత్వం క్రమబద్దీకరించటానికి సానుకూలత వ్యక్తం చేయటంతో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం ఎంపిపి కొండ శంకర్, ఎంపిడివో రమేశ్ ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ముఖ్యమంత్రి కెసిఆర్ జూనియర్ పంచాయితీ కార్యదర్శులను పర్మినెంట్ చేయటానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వటంతో పాటు పంచాయితీ రాజ్ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాను ఆదేశించటం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి స్వరూప్‌రెడ్డి, రైతుబంధు

# ఆరిజన్ డైరీ డైరెక్టర్ ఆదినారాయణ, శైలజలపై అట్రాసిటీ. పీడి యాక్ట్ నమోదు చేయాలి

మందమర్రి, ప్రభాతవార్త



బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పై అనుచిత వ్యాఖ్యలు, సామాజిక మాధ్యమాలలో వాట్సప్ ద్వారా, హైదరాబాద్‌లో ఫ్లెక్సీల ద్వారా ప్రచారం చేసిన ఆరిజన్ డైరీ డైరెక్టర్‌లు ఆదినారాయణ, శైలజలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మందమర్రి పోలీసు స్టేషన్‌లో ఎస్సై చంద్రకుమార్‌కు మంచిర్యాల జిల్లా నేతకాని మహార్ ఇంచార్జి సునార్కర్ రాంబాబు, రాష్ట్ర కార్యదర్శి సోదారి తిరుపతి, రాష్ట్ర నాయకులు జుమ్మిడి విశ్వనాథ్, రాంటెంకి రాజు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సునార్కర్ రాంబాబు మాట్లాడుతూ బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే చిన్నయ్యపై వస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని ఇదంతా ఎమ్మెల్యే చిన్నయ్య మీద కొంతమంది ఆయన పరువుకు భంగం కల్పించాలని ఉద్దేశంతో, రాజకీయకుట్రలతో అసత్య ప్రచారాలు చేస్తున్నారని తెలిపారు. ఆరిజన్ డైరీ డైరెక్టర్లు ఆదినారాయణ, శైలజ అనే వ్యక్తులు రైతుల వద్ద పెద్ద ఎత్తున డబ్బులు తీసుకోవడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న ఎమెమ్లప్య దుర్గం చిన్నయ్య వారిని బెల్లంపల్లికి పిలిపించి పోలీసులకు అప్పటించడం జరిగింది. రైతులకు మేలు జరుగుతుందనే ఉద్దేశంతో ఆరిజన్ డైరీ ప్రతినిధులు సంప్రదిస్తే ఎమ్మెల్యే అంగీకారం తెలిపారు. రైతుల వద్ద పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేసి సంస్థ ఎత్తేశారని, ఇలా రెండు తెలుగు రాష్ట్రాలలో కొన్ని ప్రాంతాలలో చేసిన మోసాన్ని ఎమ్మెల్యే ఎండగట్టడంతో వారిపై కక్ష సాధింపు చర్యలకు దిగారు. అందులో భాగంగా ఆయన గౌరవాన్ని భంగం కల్పించే విధంగా సామాజిక మాధ్యమంలో వాట్సప్ ద్వారా, హైదరాబాద్‌లో ఫ్లెక్సీల ద్వారా ఎమ్మెల్యే పై లేనిపోని ఆరోపణలు చేస్తూ ఆయన పరువుకు నష్టం చేకూర్చారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మందమర్రి ఎస్సై చంద్రకుమార్‌కు తెలపడం జరిగింది. బెల్లంపల్లి నియోజకవర్గంలో గ్రామ, గ్రామాన తిరుగుతూ ప్రజలతో మమేకమవుతూ ఎన్నో అభివృద్ధి పనులు చేస్తున్న ఎమ్మెల్యేపై కొంతమంది కుట్రపన్ని ఆరిజన్ డైరీ వ్యక్తులతో కలిసి కావాలనే ఇబ్బందులకు గురి చేస్తూ ఎమ్మెల్యే చిన్నయ్య మీద అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఆరిజన్ డైరీ డైరెక్టర్‌ల వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసీటి కేసు, పీడి యాక్ట్ నమోదు చేయాలని కోరారు.

## కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

ఉట్నూర్, ప్రభాతవార్త:



మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించే ప్రక్రియను మొదలు పెట్టాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలు జారీ చేయడం పట్ల పంచాయతీ కార్యదర్శులు హర్షం వ్యక్తం చేస్తూ కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా స్వీట్లు పంచారు. ఈకార్యక్రమంలో చాందూరు సర్పంచ్ ప్రకాష్, బీఆర్ఎస్ నాయకులు అబ్దుల్ కైసర్, పంచాయతీ కార్యదర్శులు బీఆర్ఎస్ మండల కార్యకర్తలు పాల్గొన్నారు.

**జైనథ్‌లో..**

జైనథ్, ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించడంపై మంగళవారం మండల కేంద్రమైన జైనథ్ మండల పరిషత్ కార్యాలయం ముందు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వ హించారు. ఈసందర్భంగా మండల ఎంపీపీ మారిశెట్టి గోవర్ధన్, జడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకటరెడ్డి, జేపీఎస్‌లకు మిఠాయిలు తిని పించారు. ఈకార్యక్రమంలో జైనథ్ మండల జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు మాలపాటి స్వామి, ప్రధాన కార్యదర్శి గంగన్న, కోశాధికారి సచిన్‌లతో పాటుట ఆయా శాఖల అధికారులు, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## నేడే మంత్రి చేతుల మీదుగా ఇండ్ల పట్టాల పంపిణీ

రామకృష్ణాపూర్, ప్రభాతవార్త



దశాబ్దాల కల సింగరేణి నెరవేరింది పేదింటి కలలు నిజమవుతున్నాయి. సింగరేణి స్థలాలలో నివాసముంటున్న ఇండ్లకు పట్టాలు మంజూరు చేయడం ఇప్పటివరకు ఏ ప్రభుత్వంతో కాలేదు. ఒక తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తోటి మాత్రమే సాధ్యమైందని కోల్‌బెల్ట్ ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చెన్నూర్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బాల్క సుమన్ కృషి ఫలంగానే ఈ రోజు పట్టాలు మంజూరయ్యాయని నియోజకవర్గంలో క్యాతనపల్లి మున్సిపాలిటీ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని, ఇప్పటి వరకు పాలించిన నాయకులు ఈ ప్రాంతాన్ని పట్టించుకోక వెనుకబడింది. మున్సిపాలిటీ అభివృద్ధి పనులు పూర్తిస్థాయిలోకి వస్తున్నాయని పార్కులు, ఇంగ్రిగ్రేడ్ మార్కెట్, ఆర్ఓబి ఫ్లైఓవర్ బ్రిడ్జి, పనులు చివరి దశలో ఉన్నాయి. క్యాతనపల్లి మున్సిపాలిటీలో 286 డబుల్ బెడన రూమ్ ఇళ్ల నిర్మాణం శరవేగంగా పూర్తి చేసుకొని పేదింటి కలలు నెరవేరుస్తుంది అనడంలో అతిశయోక్తి లేదు మునుపెన్నడూ లేని విధంగా తెలంగాణ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ తెలంగాణ ప్రజల గుండెల్లో ముఖ్యమంత్రి కేసిఆర్ నిలిచిపోతున్నాడు.

## అడవిజంతువుల వల్ల చంపబడిన పశువులకు నష్టపరిహారం అందించిన మంత్రి అల్లోల

నిర్మల్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త :

అటవి పరిసర ప్రాంత ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. నిర్మల్ జిల్లాలోని అటవీ కార్యాలయంలో సారంగాపూర్, నిర్మల్ మండలాల్లో ఇటీవల అడవి జంతువుల వల్ల మృతిచెందిన పాడి పశువుల కుటుంబ సభ్యులకు ఆయన నష్టపరిహారం చెక్కులను అందజేశారు. నిర్మల్ మండలం లోలం గ్రామానికి చెందిన మోహన్‌కు రూ.25 వేలు, సారంగాపూర్ మండలం ఇప్పచెల్మ గ్రామం కంబారావుకు రూ.39 వేల నష్టపరిహారం చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో వన్యమృగాల పరిరక్షణకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని వన్యప్రాణులు జనావాస ప్రాంతాల్లోకి రాకుండా ఉండేందుకు స్ట్రెంచ్‌లను ఏర్పాటుచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కన్జర్వేటివ్ ఫారెస్ట్ శర్వానంద్, డిఎఫ్‌వో సునీల్ హిరమత్, ఎఫ్ఆర్‌వో జైపాల్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల రక్షణ, భద్రత కోసమే, పోలీస్ సేవలు

**అనుమానస్పద వ్యక్తులు కనిపించినట్లయితే సమాచారం అందించాలి-సీఐ విద్యాసాగర్**

వేమనపల్లి, ప్రభాతవార్త



రామగుండం పోలీస్ కమిషనరేట్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నీల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని రాచర్ల గ్రామంలో మంగళవారం ఏసీపీ నరేందర్, సీ.ఐ విద్యాసాగర్, ఎస్ఐ సుబ్బారావు తన సిబ్బందితో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించి, సరైన పత్రాలు లేని 22 ద్విచక్రవాహనాలు, 2 ఆటో వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీ.ఐ నేరాల నిర్మూలన కోసమే, కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల రక్షణ, భద్రత కోసమే పోలీసింగ్ ఉందని, గ్రామాలలో కొత్త వ్యక్తులు, నేరస్తులు, షెల్టర్ తీసుకుని ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుడదని, యువత చెడు అలవాట్లకు బానిసగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలున్నా తమ దృజష్టకి తీసుకురావాలని, లేదా సమస్యలుంటే 100 నంబర్‌కి కాల్ చేయాలన్నారు. సైబర్ నేరాలు, మోసగాళ్ళ ఫోన్ కాల్స్, మెసెజ్లకు స్పందిచవద్దని, సూచించారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని,వాహనాలు నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలి, డ్రైవింగ్ లైసెన్స్ అందరు కలిగి ఉండాలి. గ్రామాలలో మరింత స్వీయ రక్షణ కొరకు సీసీ కెమెరాలను అమర్చుకోవాలని ఈ వషయంలో పోలీసుల సహకారం ఉంటుందని భద్రతా పరమైన అంశాలలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.

## అర్హత గల ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలి

**-ఆర్‌డీఓ రాథోడ్ రమేశ్**

ఆదిలాబాద్, ప్రభాతవార్త:



అర్హత గల ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలని ఆర్‌డీఓ రాథోడ్ రమేశ్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఓటరు జాబితాపై బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్‌డీఓ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఫారం-6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు.ఆదిలాబాద్ రూరల్ మండల పరిధిలోని బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లు పోలింగ్ కేంద్రాల వారీగా క్షేత్ర స్థాయిలో పరిశీలన జరిపి సమగ్ర ఓటర్ జాబితా తయారు చేయాలని సూచించారు.ఈసమావేశంలో సూపర్‌వైజర్లు, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## రైతులకు నాణ్యమైన ఎరువులను విత్తనాలు అందజేస్తాం

**-డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్‌రెడ్డి**

జైనథ్, ప్రభాతవార్త:



మండలంలోని 42 గ్రామ పంచాయతీల పరిధిలో ఆయా గ్రామాల్లో గల రైతులకు వానా కాలానికి, యాసంగికి నాణ్యమైన ఎరువులను, విత్తనాలను అందజేస్తామని అదిలాబాద్ డీసీసీబీ డైరెక్టర్, జైనథ్ పీఏసీఎస్ చైర్మన్, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు బాలూరి గోవర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం మండల కేంద్రమైన జైనథ్ సహకార సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని భోరజ్, ఖాప్రి, దీపాయిగూడ, గ్రామాల రైతులకు అక్కడి గోదాంలో వీటిని అందుబాటులో ఉంచామన్నారు. రైతు సంక్షేమానికి సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈకార్యక్రమంలో గూడ పీఏసీఎస్ చైర్మన్ పురుషోత్తం యాదవ్, సీఈఓ గంగన్న, రైతులు చింతలపల్లి రామ్‌రెడ్డి, దశరథ్, రాంరెడ్డిలతో పాటు మండల రైతులు సహకార సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీకి ఎల్లాపూర్ గ్రామస్థుల వినతి

**... ఎల్లాపూర్‌కు త్వరలో రోడ్డు నిర్మాణం ఏర్పాటు చేస్తాం**
**... జిల్లా ఎస్పి కె.సురేష్‌కుమార్**

కాగజ్‌నగర్ రూరల్, ప్రభాతవార్త :



కాగజ్‌నగర్ మండలం లేండిగూడ గ్రామ పంచా యతీ లోని ఎల్లాపూర్ గ్రామ స్థులు రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేయా లని కోరుతూ కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పి కె. సురేష్ కుమార్ ఐపీఎస్‌ను కలిసి వినతి పత్రం అంద జేశారు. తమ గ్రామ నుండి ఇతర గ్రామాలకు వెళ్లుటకు 3 కిలోమీటర్ల మేర సరైన రోడ్డు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, సరైన రోడ్డు మార్గం లేక వర్షాకాలంలో గర్భిణీ స్త్రీలు, వృద్ధులు ఆసుపత్రికి వెళ్లడానికి నానా అవస్థలు పడాల్సి వస్తుందని తమ గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం కల్పించి సమస్యను పరిష్కరించాలని ఎస్పికి విన్నవించారు. వెంటనే స్పందించిన జిల్లా ఎస్పి ఎల్లాపూర్ గ్రామ ప్రజల రోడ్డు సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని గ్రామస్థులు హామీ ఇచ్చి భరోస కల్పించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో గ్రామ పటేల్ సుర్పం రాంచందర్, భగ్వంత్‌రావు,పెందూరు కమలాకర్, ఆత్రం రాము, చిడం హన్మంతరావు ఆత్రం దినుకర్,కొడప మధుకర్, పెందోర్ తులసిరాం, కుంరం బొజ్జిరావ్, గ్రామస్థులు, రైతులు ఉన్నారు.